# కనిపించుటలేదు!

- వి.ఎం.ఎస్.స్వాతి

అల్లంత దూరాన లత వస్తుండడం చూస్తూనే రఘు హుషారుగా రంకేశాడు.

'ఊ, ఎందుకు పిలిచావో త్వరగా చెప్పు, వెళ్ళాలి నేను...' అంటూ దగ్గరకొచ్చి నిలబడింది లత.

'తొందరపడితే ఎలా, కూర్చో! ఏమీ ఎరగని బుజ్జి పాపాయివి పాపం, ఎందుకు పిలిచానో ఆ మాత్రం ఊహించుకోలేవా...'



'మామూలేగా నువ్వడిగేది...' బుంగమూతి పెట్టిందామె.

'వాటికి భిన్నంగా పూనుకోవాలి ఈవేళ మనం...'

'అంటే?'

'ఆడమ్, ఈవ్ మనుష్య సృష్టికి మూల కారకులు. వాళ్ళిద్దరే కనుక లేకుంటే ఇవ్వాళ నువ్వులేవు. నేను లేను... ఆ రహస్యమేదో విడమరిచి చెప్తాను, ముందు కూర్చో నువ్వు! 'ఆమె చెయ్యి పట్టుకొని గుంజాడు రఘు.

ఆ ఊపుకు తూలి అతని మీద పడింది లత.

'అల్లరి పిల్లోడా! నీ తెలివి తెల్లారినట్టే ఉంది. నీకే కాదు తెలిసింది, నాకూ తెలుసులే! ఇన్నాళ్ళుగా కలుస్తున్నాం, ఏనాడైనా ఉపాయం చెప్పావా? నిన్నటి రాత్రి ఒక కథ చదివాను, అందులో ఇలా ఉంది... బ్లౌజులోంచి ఒకటి తీసి చూపెట్టింది.

దాన్ని చూస్తూనే నిస్తుపోయాడు రఘు.

'ఆ కథలో అబ్బాయికి బుద్ధి ఉండదు నీలాగే! ఎంత సేపూ పైపై మెరుగులే! తెలివైన అమ్మాయి ఇలా దారి చూపెట్టుంది. ఏమాత్రం పొరపాటు జరిగినా నలుగుర్లో నేను తలెత్తుకోలేను జాగ్రత్త!' ఆడది తలచుకొంటే ఎంతకైనా తెగిస్తుందని అప్పుడే మొదటిసారిగా అనుభవానికొచ్చిందతనికి. తన తల్లికి ఆరోగ్యం బావుండక ఇన్ పేషెంట్ గా హాస్పిటల్లో అడ్మిట్ అయి ఉంది. ఆమెకు మందులు, ఆహారం వేళా వేళలకు తీసుకెళ్ళి ఇచ్చివచ్చే బాధ్యత తండ్రిది.

ప్రియురాలి పరువం జుర్రుకొన్న ఆనందంతో, తండ్రి హాస్పిటల్ నుంచి ఇంటికి వచ్చేలోపునే బుద్ధిగా కనపడాలనే ఉద్దేశ్యంతో తను వడివడిగా లోనికి అడుగుపెడుతున్న సమయాన్నే మాటలు వినిపించి వెనక్కు తగ్గాడు.

'నీకీ సంగతి తెలుసా? మీ అబ్బాయి మా అమ్మాయి రహస్యంగా కలుసుకొంటున్నారు...'

'మావాడు పిరికి సన్యాసి! వాడేమిటి, రహస్యంగా మీ అమ్మాయిని కలుసుకోవడమేమిటి, నేన్నమ్మను! నువ్వు తమాషాకు చెప్తున్నట్లున్నావు, బావా?'

'మగాడెంత బుద్ధావతారమైనా మనసుపడిన ఆడది దార్లోకి తెచ్చుకొనే మార్గాలు అనేకముంటాయి. ఈ రోజు కాకపోతే రేపటికైనా నిజం నీకు తెలిసొస్తుంది. నీ మీద ప్రేమతోనే మా పిల్లనూ ఏమీ అనలేకున్నాను. నీ కొడుకును బాధపెడితే ఒకటీ, నిన్ను బాధపెడితే ఒకటీనా...'

'నీ జాలిగుండెకాలా!? నువ్వు చెప్తున్నదే నిజమైతే వాళ్ళు అన్నా చెల్లెళ్ళ వరసవుతారు. తెలిసీ వాళ్ళ నెలా కలుసుకోనిస్తున్నావు...'

'నీది మరీ విడ్డూరం! మీ ఆవిడ, నేను వదిన అంటే వదిన అనుకోవడంలే!? ఆ వరసన నీకు చెల్లెల్నేగా... అదిసరే కానీ, మీ ఆవిడ కోలుకొనే సూచనలేమైనా కనిపిస్తున్నాయా?'

'తినే తిండిలో, మింగే మందులో అంచెలంచెలుగా స్లోపాయిజన్ ఇస్తుంటే మృత్యువు మెట్లెక్కడమే కానీ కోలుకోవడం కూడానా? అది త్వరలో 'హరీ' మనం పల్లిగ్గా 'సరే!'

తండ్రీ, లత తల్లీ ఏకమై తన తల్లిని చంపేస్తున్నారని తెలుస్తూనే దుఃఖం ఆపుకోలేకపోయాడు రఘు. మొదట్నుంచీ తనకు తల్లంటే అంతవాత్సల్యం! కోపావేశంతో ఊగిపోతూ తలుపులు నెట్టుకొని గదిలోకి దూరి 'రాక్షసీ! మా అమ్మను చంపే ఐడియాలు చెప్తావా? నిన్ను... నిన్ను...' అంటూ ఆమె మీద పడికొట్టనారంభించాడు.

'ఒరేయ్, ఆగరా! ఎంత పొగ్రరా నీకు, ఆమెను కొడ్తావా...' తండ్రి కలగ చేసుకొని కొడుకును గట్టిగా పట్టుకొని చెంపలు వాయగొట్టాడు. ఈ సంగతి బయటికి పొక్కితే ఇంకేమన్నా ఉందా? ప్రియురాలు, తను కటకటాల్లోకే అన్న భయంతో కొడుకును అదే గదిలోనే బంధించి బయట తాళం వేశాడు.

రెణ్ణెళ్ళబట్టీ అంతుతేలని జబ్బుతో హాస్పిటల్లో రోజు రోజుకూ కృశిస్తున్న రఘు తల్లి అదే రాత్రి కన్నుమూసింది.

రఘు తండ్రి ఉంపుడు గత్తెను ఇంట్లోకే తెచ్చి ఉంచుకున్నాడు.

తల్లి వరసైన ఆమె కూతుర్ని చెల్లెలిగా చూడ్డానికి బదులు ప్రియురాలిగా ఎంచుకోవడం ఇష్టంలేక అదీగాక తన తల్లిని కుతంత్రంతో చంపిన దోషులున్న ఇంట్లో ఉండను మనస్కరించక ఓ అపరాత్రివేళ కష్టవశాన కిటికీ రెక్క ఊడబెరికి ఇల్లొదిలి పారిపోయాడు రఘు.

ఆ తర్వాత అతనేమయ్యాడో, ఎక్కడున్నాడో తెలిసినవారేలేరు.